ముక్కలు చేసుకుని మరీ డబ్బు పంపుతున్నది. తమ్ముడు ఎంత బెంగ పెట్టుకున్నాడో? అమ్మ వెళ్లినప్పటి నుంచి నన్ను అసలు వదలకుండా తిరిగేవాడు. అసలు నేను ఎవరికి ఏం అన్యాయం చేశానని నా బతుకు ఇంతగా బండలైంది. ఇలా.. ఆలోచనలు తెగేవి కాదు.

అక్కణ్నుంచి తప్పించుకుందామని నేను చేసే ప్రయత్నాన్ని గమనించిన గంగవ్వ నన్ను ఆపింది.

''వద్దమ్మా! నేను చెప్పే మాట విను. ఇక్కణ్నుంచి తప్పించుకోవడం మనవల్ల కానిపని. అది తెలిస్తే ఇంకా నరకం చూపిస్తారు''.. బతిమాలుతూ చెప్పిన ఆమె మాటల్లోని చేదు నిజం నాకు అర్థమైంది. గంగవ్వ చాలా మంచిది. ఆమె వయసులో ఉన్నప్పుడు చాలా అందంగా ఉండేదిట. ప్రేమ అంటూ ఎవరో మోసం చేసి జమునా బాయికి అమ్మేశాడుట. అప్పట్లో తప్పించుకుందామని చాలాసార్లు ప్రయత్నించి విఫలమైంది. ఆమె అందం మీద జమునాబాయి బాగా సంపాదించింది. ఒకసారి ఒకడు వాడి వెర్రి మొర్రి కోరికలను తీర్చలేదని గంగవ్వ మొహం మీద కత్తితో పొడిచేశాడుట. మొహం అలా అందవికారంగా తయారవడం వల్ల ఆకర్షణ కోల్పోయింది. అప్పట్నుంచి పనులు చేసి పెడుతూ జమునా బాయి దగ్గరే ఉండిపోయింది. తిరిగి వెళ్లిన ఆడవాళ్లకు సంఘంలో గౌరవం దక్కదని ఆమె తెలుసుకుంది.

జమునాబాయి షుగరు, హైబీపీతో మంచం పట్టింది. గంగవ్వ ఆమెకు సేవలు చేస్తున్నది. జమునాబాయి చేసిన పాపాలు చివరి దశలో ఆమెను మానసికంగా వేధిస్తున్నట్లున్నాయి. అమ్మాయిలు అందరి వైపు చూస్తూ కళ్ల నీళ్లు పెట్టుకుంటున్నది. ఆరోజు అర్ధరాత్రి ఆమె ప్రాణాలు పోయాయి. తెల్లవారితే ఆమె దగ్గర ఉండే గూండాలు ఆడపిల్లలందర్నీ వేరే కంపెనీలకు అమ్మేస్తారని గంగవ్వకు తెలుసు. నేను, మరొక అమ్మాయి షబానా ఈ నిత్యనరకాన్ని పడలేకపోతున్నామని తెలిసిన గంగవ్వ మమ్మల్ని తెల్లవారేలోగా తప్పించింది. రెండేళ్ల క్రితం షబానా, ఆమెను ప్రేమించిన నరేశ్ ఇంటినుంచి పారిపోతుండగా అతణ్ని బాగా కొట్టి, షబానాను తెచ్చి జమునాబాయికి అమ్మేశాడు ఒక లారీ డ్రైవర్. ఆమె ఆచూకీ తెలుసుకున్న నరేశ్ ఆమె కోసం తరచూ వచ్చేవాడు. ఆమె మీద ప్రేమను చంపుకోలేక, ఆమెను విడిపించలేక తల్లడిల్లిపోయేవాడు. బయటపడిన వార్త గంగవ్వ ద్వారా తెలిసిన నరేశ్ వెంటనే వచ్చి షబానాను కలిసాడు. ఎక్కడికో దూరంగా వెళ్లిపోయి బతుకుతామని గంగవ్వకు కృతజ్ఞతలు చెప్పి, షబానాను తీసుకుని వెళ్లిపోయాడు.

నేను, గంగవ్వ వేరే ఊరికి ప్రయాణమయ్యాం. ఇంతలో నేను గర్భవతిననే విషయం తెలిసింది. కడుపులో పెరుగుతున్న బిడ్డను చంపడానికి నాకు మనసు రావడం లేదు. ఏదో ఒక చిన్న ఉద్యోగం సంపాదించి, గౌరవంగా బతకాలని నిర్ణయించుకున్నాను. కానీ, నా అందం నాకు శాపం అయ్యిందో లేక తోడులేని ఆడది కంచె లేని చేనులా కనిపిస్తుందేమో తెలియదు. ఎక్కడికి వెళ్లినా.. 'వస్తావా?' అని అడిగేవాళ్లే ఎదురయ్యారు. గంగవ్వ నాలుగిళ్లల్లో పాచి పనికి కుదిరి నన్ను కూడా పోషించసాగింది. పోనీ చిన్నపిల్లలు నలుగుర్ని చేరదీసి ప్రైవేట్ చెబుదామన్నా.. 'ఎక్కణ్నుంచి వచ్చారో ఏమిటో?' అనుకుంటూ పిల్లల్ని పంపేవారు కాదు. అనాథ స్త్రీల సంక్షేమ నిలయాలు ఉంటాయని వినడమే కానీ.. ఎక్కడ ఉంటాయో తెలియదు. ఒక పెద్దమనిషి.. 'నేను చూపిస్తా!' అంటూ గెస్ట్‌హౌస్‌కి తీసుకెళ్లబోయాడు. అక్కణ్నుంచి తప్పించుకోడానికి చావుతప్పి కన్ను లొట్టబోయినట్లు అయ్యింది.

వెక్కివెక్కి ఏడుస్తున్న నన్ను గంగవ్వ ఓదార్చింది.

''అంతే తల్లీ మన బతుకులు! మంచిగా ఉందామన్నా ఈ లోకం పడనివ్వదు. నువ్వు మసిగుడ్డలో కట్టిన మానిక్కం లాంటి దానివి. నీ అందం దాచడం కట్టం. నువ్వా.. కడుపు తీయించుకోవడానికి ఇట్టపడటం నేదు. కొన్నాళ్లు పోతే యాపారం చేసుకోలేవు. ఇంకో నాలుగైదు నెలలు పని చేసుకుని సంపాదించుకున్న డబ్బు ఉంటేనే గండం గడిచి పిండం బయటపడుద్ది. నేను సెప్పిన ఇసయం ఆలోసించుకో తల్లి!''.. తల నిమురుతూ చెప్పింది. నా గుండె మెలిపెట్టినట్లు అయ్యింది. ఆమె మాటల్లోని నిజం నన్ను మళ్లీ బురదలోకి లాగింది. విటు



'నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2022'లో రూ.2 వేల బహుమతి పొందిన కథ.